కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 25, పచ్చిమిర్చి 50 , బెండ 60, కాకర 60, దొండ 80, దోస 40, ఆలు 25, చామ 60, కీర 25, బీర 70, వంకాయ 60, గోకర 60, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 70, ఉల్లి 60 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 250, వెల్లుల్లి 250.

పనుల్లో వేగం పెంచాలి

మియాపూర్: మియాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న తరగతి గదుల నిర్మాణ పనులను కార్పొరేటర్ ఉప్పల పాటి శ్రీకాంత్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో వేగం పెంచాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు వసుంధరదేవి, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, మదన్‌మోహన్, సత్యనారాయణరావు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్ తదితరులు

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు



వరద ముంపు లేకుండా..!

- మూడు నెలల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు
- రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటున్న స్థానికులు



- పనుల మొత్తం విలువ రూ. 4 కోట్లు
- చేపట్టనున్న పనులు కల్వర్టు, బాక్స్‌టైప్ డ్రైయిన్



లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద కల్వర్టు, బాక్స్‌టైప్ డ్రైయిన్ పనులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదనీటి ఇబ్బందిని తాత్కాలికంగా తొలగించే పనులు మొదలయ్యాయి. చిన్నపాటి వర్షానికి ఇక్కడ రాకపోకలు నిలిచిపోతున్న విషయం తెలిసిందే. రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతుండగా, ప్రస్తుతానికి తాత్కాలిక పనులకే మొగ్గు చూపారు. ఎన్నికల ముందు కల్వర్టు, బాక్స్‌టైప్ డ్రైయిన్ పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. మూడు నెలల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు దృష్టి పెట్టారు.

- కల్వర్టు, బాక్స్‌టైప్ డ్రైయిన్ నిర్మాణానికి నాలుగు మంచి నీటి పైప్‌లైన్లు అడ్డంకిగా మారాయి.
- రెండు పైప్‌లు స్లాబ్ వరకు వస్తున్నాయి. మరో రెండు కిందకు ఉండగా వాటిని కూడా స్లాబ్ లెవల్‌కు తీసుకొస్తారు. జలమండలి సానుకూలంగా స్పందించడంతో పనులకు అడ్డంకులు తొలగినట్టయ్యింది.
- ఈ పనులు పూర్తయితే భారీ వర్షం కురిసినా రాకపోకలకు ఇబ్బంది ఉండదు. వరదనీరు కల్వర్టు కింద ఉన్న బాక్స్‌టైప్ డ్రైయిన్‌లోకి వెళ్లి అక్కడ నుండి సాఫీగా ముందుకు వెళుతుంది.
- దీంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి సమస్య తలెత్తదని అధికారులు చెబుతున్నారు.
- ప్రస్తుతం పనులు సాగుతున్న క్రమంలో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆ టంకం ఏర్పడకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

చెరువులను సంరక్షిస్తాం



రేగులకుంట చెరువు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: చెరువులు కలుషితం కాకుండా, కబ్జాలకు గురికాకుండా పూర్తిస్థాయిలో సంరక్షిస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీ నగర్ కాలనీ, రేగుల కుంట చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా సీఎస్ఆర్ ఫండ్స్ రూ.కోటి 50లక్షల వ్యయంతో సేల్స్ ఫోర్స్ ఐటి కంపెనీ చేపడుతున్న సుందరీకరణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేగులకుంట చెరువు దశ మారనుందన్నారు. కార్యక్రమంలో సేల్స్ ఫోర్స్ ఐటి కంపెనీ ప్రతినిధులు చైతన్య, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



అయ్యప్పసొసైటీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు

మాదాపూర్: అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం కూల్చివేశారు. మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో అక్రమంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు విచ్చలవిడిగా చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపడితే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అయ్యప్పసొసైటీలో అక్రమంగా నిర్మాణాలను జేసీబీతో తొలగించారు. కాగా బడాబాబులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నప్పటికి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

బాచుపల్లి మండలంలో..



ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

నిజాంపేట్: బాచుపల్లి మండలంలోని సర్వే నం.191లో సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కొంత కాలంగా నిజాంపేట్‌లోని సర్వే నం.191లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని గుర్తించిన రెవెన్యూ అధికారులు సోమవారం తహసీల్దార్ పూల్ సింగ్ ఆధ్వర్యంలో సిబ్బంది, పోలీస్ బందోబస్తు నడుమ ఆ గదులను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని తహసీల్దార్ ఈ సందర్భంగా కబ్జాదారులకు హెచ్చరించారు. అదేవిధంగా ప్రైవేటు స్థలమని బారికేడ్లు ఏర్పాటు చేసుకున్న వాటిని సైతం అధికారులు తొలగింపజేశారు. కబ్జాదారులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడం చూసి అధికారులు విస్తుపోయారు. మరోసారి అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని వారు పేర్కొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

కేదార్‌నాథ్ దేవస్థానం ప్రధాన అర్చకులు శివలింగస్వామి



కేదార్‌నాథ్ ప్రధాన అర్చకులు శివలింగస్వామిని సన్మానించిన అర్చకులు, భక్తులు

పటాన్‌చెరు టౌన్: శివ అంటే సంస్కృతంలో స్వచ్ఛమైనదని, రోజు 108 సార్లు ' ఓం నమఃశివాయ' అని జపిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని కేదార్‌నాథ్ దేవస్థానం ప్రధాన అర్చకులు శివలింగ స్వామి అన్నారు. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా పట్టణంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం కేదార్‌నాథ్ దేవస్థానం ప్రధాన అర్చకులు, సంగారెడ్డి జిల్లా, నారాయణఖేడ్ వాస్తవ్యులు శ్రీ శివలింగస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన అర్చకులు గణేష్, మహేష్‌లు, కమిటీ సభ్యులు ఆయన్ని ఘనంగా సత్కరించారు. అనంతరం మంజీరా దేవస్థానం ప్రధాన అర్చకులు మహేష్‌స్వామి మాట్లాడారు. ఈ సందర్భంగా శివలింగస్వామి మాట్లాడుతూ భక్తి ఉన్నచోటనే పరమేశ్వరుడు ఉంటాడని.. భక్తి భావనతో అందరూ ముందుకు వెళ్లాలని తెలిపారు.

ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

అల్విన్‌కాలనీ: సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకొని సోమవారం సుమిత్రానగర్‌లోని నాగదేవత ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అనిల్ కుమార్, మల్లేష్, నవీన్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. సోమవారం చందానగర్ బీఆర్ఎస్ నాయకులు రఘుపతిరెడ్డి, ఇతర నాయకులు ఎమ్మెల్యే గాంధీని కలిసి ఆయనను సన్మానించారు. అలాగే కొండాపూర్ డివిజన్ నెక్టార్ గార్డెన్స్ కాలనీవాసులు గాంధీని ఘనంగా సత్కరించారు. కాలనీవాసులు సూర్యప్రకాశ్, గంగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రత్నారావు, వల్లభరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

చందానగర్ శిల్ప ఎన్‌క్లేవ్‌లోని విశాఖ శ్రీ శారదపీఠ పాలిత శ్రీ లక్ష్మీ దేవాలయంలో శ్రీ సహస్ర రుద్ర సహిత చండీయాగం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకెపూడి గాంధీ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ రమణమూర్తి, కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, సుధాకర్‌రావు, చంద్రశేఖర్, గోవర్ధన్‌గౌడ్, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీని సత్కరించిన చందానగర్ నాయకులు

21,22 తేదీల్లో గణితం క్విజ్ పోటీలు



గీతంను సందర్శించిన పాలిటెక్నిక్ విద్యార్థినులు

పటాన్‌చెరు టౌన్: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం స్కూల్ ఆఫ్ సైన్సెస్‌లోని గణిత శాస్త్ర విభాగం ఈ నెల 21, 22 తేదీలలో జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించనుంది. ఈ విషయాన్ని గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, ఈ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మల్లికార్జునరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులకు గణిత శాస్త్రంపై మక్కువను పెంపొందించడం, వారి గణిత నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను అందించడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఈ పోటీలలో 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.ఆసక్తి గల వారు తమ పేర్లను ఈనెల 20వ తేదీలోగా నమోదు చేసుకోవాలని, విజేతలకు నగదు పురస్కారంతో పాటు, ప్రశంసా పత్రాలను అందజేస్తామని డాక్టర్ మల్లికార్జున్ తెలిపారు. ఇతర వివరాల కోసం 98493 17334ని సంప్రదించాలని సూచించారు. కాగా సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు సోమవారం గీతం విశ్వవిద్యాలయంను సందర్శించారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని దుర్గామాతను కోరుకున్నానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల దుర్గాభవాని ఆలయాన్ని సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ సమీపంలో అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లి గ్రామ సర్పంచ్ లలితా మల్లేష్ అధ్వర్యంలో నిర్మించిన నూతన షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కిష్టారెడ్డిపేట సర్పంచ్ కృష్ణ, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సిద్ధిఖీనగర్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ



కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

గచ్చిబౌలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖ్‌నగర్, రాఘవేంద్ర కాలనీలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం కేక్‌లు కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, గణపతి, బస్వరాజు, పాస్టర్లు టీఆర్‌రాజు, జర్మయ్య, క్రిస్టియన్ సోదరులు పాల్గొన్నారు.

భారతీనగర్ డివిజన్ పరిధిలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి సొసైటీ గ్రౌండ్స్ లో భారతినగర్ డివిజన్ పాస్టర్స్ మరియు ఇవాంజెలిస్ట్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, నగేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, పాస్టర్ ప్రశాంత్, ఆయా చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ పుష్పనాగేష్



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రపురం (పటాన్‌చెరు): అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలని అదేవిధంగా సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ అన్నారు.సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో 13 బ్లాక్ లో రూ.30 లక్షల వ్యయంతో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రవీణ్, ఖాజా,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో సోమవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ ఆఫీస్ ఎదురుగా ఉన్న లింకురోడ్డులో రోడ్లను క్లీన్ చేయడంతో పాటు చెత్తా చెదారం తొలగించారు. ఈ సందర్భంగా శానిటేషన్ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్మికులు ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకొని పనులు చేస్తారని వివరించారు. ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా జీహెచ్‌ఎంసీకి సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్థానంలో జ్యూట్ బ్యాగులను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.



రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులు

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి



మియాపూర్: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా మియపూర్ దీప్తిశ్రీనగర్‌లోని ధర్మపురి క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వారికి అభిషేకం, అర్చన చేశారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సహస్ర నామార్చన, పల్లకిసేవ కార్యక్రమాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

మార్షల్‌ఆర్ట్స్‌లో ప్రతిభ

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటారు. ఆదివారం మహబూబ్ నగర్‌లో శ్రీ హనుమాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్‌లో విద్యార్థులు మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని పరిపాలనా భవనం ముందు విద్యార్థి సంఘం 2023–24 ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. హెచ్‌సీయూలో ఇటీవల మృతి చెందిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం చెల్లించాలని, వారి మృతిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అతీక్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి మోహిత్ మాట్లాడుతూ ఉద్యోగులకు భద్రత కల్పించాలని, మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు



సదస్సులో మాట్లాడుతున్న వీసీ బీజే రావు

రాయదుర్గం: పర్యావరణ పరిరక్షణకు అందరూ సమష్టిగా కృషి చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని బిపి రాధాకృష్ణన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్ (సీఈఓఏఎస్), స్కూల్ ఆఫ్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పు, క్లీన్ ఎనర్జీ' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులకు మానవ తప్పిదాలే కారణమన్నారు. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణలో విధాన మార్పులను తీసుకురావడంలో కూడా అందరూ సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఆర్ఈడీసీఓ) ఇంధనశాఖ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత, ప్రత్యామ్నాయ ఇంధన వ్యవస్థలు, నికర సున్నా కర్బన ఉద్గారాల గురించి పౌరులకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ డీన్ ప్రొఫెసర్ కేసీ జేమ్స్‌రాజు, సీఈఓఏఎస్ హెడ్ ప్రొఫెసర్ ఎం జయానంద్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జి కిషోర్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గ్రంధి కిషోర్‌కుమార్ ప్రసంగించారు.

స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

బాలానగర్: జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఇండోర్ స్విమ్మింగ్‌పూల్‌లో సోమవారం మెన్ అండ్ ఉమెన్ స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఎంపికైన క్రీడాకారులు జనవరి 2 నుంచి 4 వరకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెన్నైలో జరిగే సౌత్ వెస్ట్ చాంపియన్ షిప్‌లో పాల్గొనున్నారు. సెక్రటరీ స్పోర్ట్స్ డా. ఎన్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డా.అశోక్ పాల్గొన్నారు.

భళా.. కూచిపూడి..జానపద నృత్యాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో భాగంగా సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నగరవాసులను అలరించాయి. అనంతపూర్ తోలుబొమ్మలు, కోట, పోచంపల్లి, పట్లోళ్ళ శారీస్, మహేశ్వరం, టెర్రకోట కుండలు తదితర హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా దుబాయ్ నుంచి వచ్చిన కళాకారిణి శ్రావణి తేనేటి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. అలాగే తంజావూర్, కర్ణాటక, మధ్యప్రదేశ్ జానపద నృత్యాలు అలరించాయి.



రేపు శంకర మఠానికి అయోధ్య రథం

మోతీనగర్: అయోధ్య రామయ్య ప్రతిష్ఠాపన, పట్టాభిషేకం మహోత్సవం సందర్భంగా నదీ జలాలను సేకరించి అయోధ్యకు తీసుకువెళ్లే విధంగా రథాలను ఏర్పాటు చేశారు. ఈ రథం మోతీనగర్‌లోని శంకర మఠానికి ఈనెల 20వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు చేరుకోనుంది. ఈ సందర్భంగా మోతీనగర్ పరిసర ప్రాంత భక్తులు శంకరమఠానికి చేరుకొని ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని శంకరమఠం కార్యనిర్వహణాధికారి సీఎస్ఆర్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. తమ గోత్ర నామాలతో పూజ చేసుకొని రూ.516 శ్రీరాముడి పట్టాభిషేకానికి సమర్పించాలని నిర్ణయించారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

నెక్సస్‌మాల్‌లో క్రిస్మస్ సంబరాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్‌లో క్రిస్మస్ సంబరాలు ప్రారంభమయ్యాయి. మాల్‌లో షాపింగ్ చేసిన వారికి ఖచ్చితమైన బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డిసెంబర్ 25న 'శాంటా కవాతు' జరుగుతుందన్నారు. ఈనెల 31వ తేదీ వరకు ఈ క్రిస్మస్ వేడుకలు కొనసాగుతాయని తెలిపారు.